క్లుప్తంగా

ఎస్పీ దామోదర్ ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజలు చేస్తున్న ఎస్పీ దామోదర్, పక్కన డీఎస్పీ నాగరాజు

మార్కాపురం టౌన్: శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీ లక్ష్మి చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఎస్పీ ఏఆర్ దామోదర్ చెన్నకేశవస్వామి దేవస్థానంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈఓ గొలమారి శ్రీనివాసరెడ్డి, అర్చకులు ఎస్పీకి ఘన స్వాగతం పలికారు. బ్రహ్మోత్సవాల విశిష్టతను, వాహన సేవల వివరాలను, ఆలయ చరిత్రను అర్చకులు తెలిపారు. ఆయన వెంట డీఎస్పీ డాక్టర్ నాగరాజు, ఎస్బీ సీఐ రాఘవేంద్ర, సీఐ సుబ్బారావు, పలువురు ఎస్సైలు ఉన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు ఎస్పీ సూచించారు. ఎస్పీకి స్వామివారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రం అందించి ఆశీర్వచనం చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు



కొమరోలు : తీవ్రంగా గాయపడిన బాషా

కొమరోలు: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని తాటిచెర్ల మోటు జంక్షన్‌లో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. గిద్దలూరుకు చెందిన బాషా అనే వ్యక్తి రోజులాగే గ్రామాలు తిరిగి ఐస్‌లు అమ్ముకుని సైకిల్‌పై వెళ్తుండగా బేస్తవారిపేట వైపు నుంచి గిద్దలూరు వెళ్తున్న లారీ సైకిల్‌ను ఢీకొనడంతో బాషాకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని ప్రైవేటు వాహనంలో గిద్దలూరు వైద్యశాలకు తరలించారు.

లారీ బోల్తా..డ్రైవర్‌కు గాయాలు



కొమరోలు : రహదారిపై బోల్తాపడిన లారీ

కొమరోలు: లారీ బోల్తాపడడంతో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని అయ్యవారిపల్లె, ఇడమకల్లు గ్రామాల మధ్యలో శుక్రవారం చోటు చేసుకుంది. పైపుల లోడుతో వెళ్తున్న లారీ పశ్చిమ బెంగాల్ నుంచి కడపకు వెళ్తుండగా లారీ క్యాబిన్ వెనుక భాగం లింకు ఊడిపోవడంతో ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు డ్రైవర్ తెలిపాడు. లారీడ్రైవర్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు.

అగ్ని ప్రమాదాల నివారణ చర్యలపై అవగాహన



అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

గిద్దలూరు రూరల్: అగ్ని ప్రమాదాల నివారణ చర్యలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండి అప్రమత్తంగా ఉండాలని స్థానిక అగ్నిమాపకశాఖ అధికారి హరిబాబు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఒంగోలు జాతీయ రహదారి సమీపంలోని పెట్రోల్ బంకు ఆవరణలో శుక్రవారం అగ్నిప్రమాదాల పై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పెట్రోల్ బంకులో పనిచేస్తున్న సిబ్బందికి, వాహనదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపకశాఖ సిబ్బంది బీమానాయక్, డి.పీరావలి, రియాజ్, లక్ష్మీనాయక్, సుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ లీకేజీతో అప్రమత్తంగా ఉండాలి



గ్యాస్ మంట ఆర్పే విధానాన్ని చూపుతున్న ఫైర్ ఆఫీసర్‌లు

మార్కాపురం: అగ్నిప్రమాదం జరిగేందుకు అవకాశం ఉండే గ్యాస్ సిలిండర్స్ లీకేజీతో అప్రమత్తంగా ఉండాలని మార్కాపురం ఫైర్ ఆఫీసర్ రేగలగడ్డ రామకృష్ణ అన్నారు. శుక్రవారం గ్యాస్ వాడకంపై ప్రజలకు, ఆయా గ్యాస్ ఏజెన్సీల్లో పనిచేసే సిబ్బందికి అవగాహన కల్పించారు. గ్యాస్ లీకేజీ ఫైర్ సంభవిస్తే ఏ విధంగా ఆపాలో సిబ్బందికి, డెలివరీ బాయ్స్‌కి డెమో ద్వారా చూపించారు. గ్యాస్ గోడౌన్ యజమానులు కూడా వెంటిలేషన్ సరిగ్గా ఉందో లేదో చూసుకోవాలని, నాణ్యమైన విద్యుత్ వైర్లతో కరెంటు వాడుకోవాలని, ఫైర్ బకెట్స్, ఇసుక, నీరు ఎప్పుడూ నిల్వ ఉంచుకోవాలన్నారు. గోడౌన్ పరిసర ప్రాంతాల్లో సిగరెట్, బీడీ తాగకుండా నో స్మోకింగ్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు.

పేదలపై గ్యాస్ బండ

- పెరిగిన గ్యాస్ ధరలతో సామాన్యుల ఇక్కట్లు
- గ్యాస్ సిలిండర్‌పై రూ.50 పెంపు ప్రజలపై అదనపు భారం
- నియోజకవర్గంలో 90 వేలకు పైగా గ్యాస్ కనెక్షన్లు
- ఇప్పటికే విద్యుత్ చార్జీల పెంపుతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఇది అదనపు భారం



గ్యాస్ సిలిండర్లు సరఫరా చేస్తున్న ఆటో

కంభం:

పెరిగిన నిత్యావసర ధరలు, కరెంటు చార్జీలతో సతమవుతున్న పేద ప్రజలపై కేంద్ర ప్రభుత్వం మరోసారి భారం మోపింది. వంటగ్యాస్ ధర రూ.50 పెంచడంతో సిలిండర్ ధర రూ.850 నుంచి రూ.900 కు చేరుకుని సామాన్య ప్రజలు లబోదిబోమంటున్నారు. నియోజకవర్గంలో ఇండియన్, భారత్, హెచ్‌పీ గ్యాస్ కంపెనీలకు చెందిన ఏజెన్సీలకు సంబంధించి సుమారు 94,610 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. సగటున ఒక కుటుంబానికి 6–8 సిలిండర్ల వరకు వినియోగిస్తుంటారు. ఈ లెక్కన ప్రతి కుటుంబానికి ఏడాదికి రూ.300– రూ.400 అదనపు భారం పడుతుంది. ఈ ధరల పెరుగుదలతో నియోజకవర్గంలోని సామాన్య, మధ్య తరగతి కుటుంబాలు తీవ్ర ఆందోళన చెందుతున్నాయి.

పేదలపై అదనపు భారం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే కరెంటు బిల్లులు, నిత్యవసరాల ధరలు తగ్గిస్తామని చెప్పిన నాయకులు అధికారంలోకి వచ్చిన వెంటనే ట్రూ అప్ చార్జీల పేరిట ఇష్టానుసారంగా కరెంటు బిల్లులు పెంచేయడంతో బిల్లులు చూస్తే షాక్ కొడుతున్నాయి. అదే సమయంలో ఎన్నికలకు ముందు గ్యాస్ ధరలను స్వల్పంగా తగ్గించిన కేంద్ర ప్రభుత్వం ఆ తర్వాత ధరలు పెంచేయడంతో పేదలపై అదనపు భారం పడుతోంది. సివిల్ సప్‌లై అధికారుల పర్యవేక్షణ లోపంతో డెలివరీ చార్జీలు ఒక్కో చోట ఒక్కోలా వసూలు చేస్తుండటం మరో అదనపు భారంగా మారుతోంది. కేంద్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం ఉజ్వల పథకం ద్వారా ఉచితంగా గ్యాస్ సిలిండర్లు, స్టవ్‌లు అందచేసింది. తాజాగా పెంచిన రూ.50 గ్యాస్ ధర ఉజ్వల లబ్ధిదారులకు కూడా వర్తించనుండటంతో వారు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. పేద ప్రజల కష్టాలు తెలుసుకొని ధరలను వెంటనే తగ్గించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

నియోజకవర్గంలో గ్యాస్ కనెక్షన్ల వివరాలు	
కంభం :	18,000
అర్ధవీడు :	9,750
రాచర్ల :	8,660
కొమరోలు :	14,000
బేస్తవారిపేట :	10,200
గిద్దలూరు :	34,000

పేదలపై అదనపు భారం



ఎన్నికలకు ముందు ధరలు తగ్గిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అన్నిరకాల ధరల పెంపుతో పేద ప్రజల నడ్డి విరిచింది. ప్రస్తుత పరిస్థితుల్లో ఉపాధిలేక ప్రజలు అల్లాడుతున్నారు. ఇప్పటికే కరెంటు చార్జీలు పెరిగి అల్లాడుతున్న ప్రజలకు కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలు పెంచడంతో అదనపు భారంగా మారింది. ప్రభుత్వం తక్షణమే పెంచిన ధరలను తగ్గించాలి.

– షేక్ అన్వర్, సీఐటీయూ మండల కార్యదర్శి, కంభం

సిలిండర్ బుక్ చేయాలంటే భయమేస్తుంది



పెరిగిపోతున్న ధరలు చూస్తుంటే భయమేస్తుంది. గ్యాస్ సిలిండర్ బుక్ చేయాలంటే భయమేస్తుంది. ఎంత జాగ్రత్తగా వాడుకున్నా ఏడాదికి 6–7 సిలిండర్లు అవసరమవుతాయి. సిలిండరుపై రూ.50 పెంచడం అన్యాయం.

– షేక్ హాలీమాబి, కంభం

ధరలు తగ్గించాలి



పెంచిన సిలిండరు ధరలను వెంటనే తగ్గించేలా చూడాలి. ఓ వైపు నిత్యావసర ధరలు మండిపోతున్నాయి. ఇప్పటికే కరెంటు బిల్లులు పెరిగిపోయాయి. మళ్లీ అదనంగా గ్యాస్‌సిలిండర్ ధరలు పెంచేస్తే సామాన్యులు ఎలా బతకాలి.

– టి.విక్టోరియా రాణి, కందులాపురం



రోడ్డుపై ఉన్న మట్టి కుప్పలు

అధికారులకు పట్టదా..?

- నాలుగు నెలలుగా సాగుతున్న రోడ్డు విస్తరణ పనులు
- రోడ్డుపై మట్టికుప్పలతో రాకపోకలకు ఇబ్బందులు

బేస్తవారిపేట: రోడ్డు విస్తరణ పనులు ప్రజలకు నరకం చూపుతున్నాయి. పట్టణంలోని జెడ్పీ బాలుర హైస్కూల్ నుంచి ఒంగోలు–నంద్యాల హైవే రోడ్డు వరకు రోడ్డు విస్తరణ పనుల కోసం సీసీ రోడ్డుకు ఇరువైపులా యంత్రాలతో ఎర్త్‌వర్క్ కోసం మట్టిని పెకిలించారు. రోడ్డుకు ఇరువైపులా నివాస గృహాలు ఉన్నాయి. తవ్వకాలతో కనీసం గృహాల్లోకి వెళ్లేందుకు అవకాశం లేకుండాపోయింది. నాలుగు నెలలుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వృద్ధులు గృహాల్లోంచి బయటకు వచ్చేందుకు పడుతున్న అవస్థలు అన్నీఇన్నీకావు. రేషన్ బియ్యం వాహనం కూడా వీధుల్లోకి వచ్చే అవకాశం లేకపోవడంతో కార్డుదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇరువైపులా రోడ్డు నిర్మాణం కోసం అడుగు మేర గుంత తీయడంతో వాహనాల రాకపోకల సమయంలో ఏదైనా వాహనం ఎదురైతే చుక్కలు కనపడుతున్నాయి. వెనక్కు వెళ్లలేక ముందుకు సాగలేక నరకయాతన అనుభవిస్తున్నారు. కొన్ని రోజులు డస్ట్ దొరకడంలేదు..తర్వాత బిల్లులు రావడం లేదంటూ..మరికొన్ని రోజులు వర్షాలు..ఇప్పుడు సిమెంట్ రేట్ పెరిగింది..ఇలా ఏదో ఒక కారణంతో రోడ్డు నిర్మాణం నత్త కన్నా దారుణంగా ముందుకు సాగుతోంది. వాహనదారులకు, ప్రయాణికులకు కష్టాలు తప్పడంలేదు. నాలుగు రోజుల క్రితం పనులు మొదలు పెట్టారు. సిమెంట్ అయిపోయింది...రేట్ పెరిగిందని పనులు ఆపేశారు. ప్రస్తుతం సిమెంట్ రోడ్డుపై మట్టికుప్పలు రోడ్డు మొత్తం పోసిపెట్టారు. ఇప్పటికి మూడు రోజులుగా వాహనాలు తిరిగే పరిస్థితి పూర్తిగా లేకుండాపోయింది. అధికారులు ఇంత తీవ్ర నిర్లక్ష్యంగా కాంట్రాక్టర్ వ్యవహరిస్తున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు.

భూఆక్రమణపై పోలీసులకు ఫిర్యాదు



పీకేసిన పూరి గుడిసె, చెట్లు

కొనకనమిట్ల: మండలంలోని చినారికట్ల గ్రామానికి చెందిన ఉడుముల జగన్‌మోహన్‌రెడ్డికి చెందిన భూమిని ప్రభుత్వ పెద్దల సహకారంతో ఆక్రమించి భూమిలో ఉన్న చెట్లను, పూరి గుడిసెను తొలగించిన సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. జగన్‌మోహన్‌రెడ్డి తల్లి ఉడుముల ఆదిలక్ష్మమ్మకు చెందిన భూమి సర్వే నంబరు 78/2లో 8 ఎకరాల విస్తీర్ణం ఉంది. జగన్‌మోహన్‌రెడ్డి వాటాకు సంబంధించి కొంత భూమి వచ్చింది. ఆ భూమిని సర్వే చేయించి చుట్టూ ఫెన్సింగ్ వేసి కొంత భూమిలో పొగాకు సాగు చేశాడు. దాంట్లోనే పూరి గుడిసె వేశాడు. 50 సెంట్ల భూమిని హెచ్‌పీసీఎల్ పెట్రోల్ బంకు ఏర్పాటుకు లీజుకు ఇచ్చాడు. ఇటీవల ఆయన పనిపై హైదరాబాద్ వెళ్లాడు. ఆయన లేని సమయంలో లాయర్ లక్ష్మీరెడ్డి ప్రోద్బలంతో ఉడుముల దశరథరామిరెడ్డి, శంకరరెడ్డితో పాటు యోగి, జేసీబీ డ్రైవర్ అప్పలనాయుడు కలిసి భూమిలో ఉన్న వేపచెట్లు, పూరి గుడిసెను తొలగించారు. దీంతో రూ.2 లక్షల మేర నష్టం వాటిల్లింది. జగన్‌మోహన్‌రెడ్డి కొనకనమిట్ల పోలీస్‌లకు ఫిర్యాదు చేశాడు. పోలీస్‌లు సంఘటన స్థలానికి వచ్చి వివరాలు సేకరించారు. పోలీసులు వెళ్లిన తర్వాత మళ్లీ దౌర్జన్యంగా ఆయన భూమిలోకి వెళ్లారు. ప్రభుత్వ పెద్దల సహకారంతో ఇంతటి దౌర్జన్యానికి పాల్పడుతున్న దశరథరామిరెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జగన్‌మోహన్‌రెడ్డి పోలీసులను కోరుతున్నాడు.

సోలార్ ప్యానల్స్‌ను ఏర్పాటు చేసుకోవాలి



కొమరోలు : ప్రజలకు అవగాహన కల్పిస్తున్న విద్యుత్‌శాఖ ఏఈ శ్రీనివాసులు

కొమరోలు: సోలార్ ప్యానల్స్‌ను ప్రజలు ఇళ్ల వద్ద ఏర్పాటు చేసుకోవాలని విద్యుత్‌శాఖ ఏఈ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని రెడ్డిచెర్ల గ్రామంలో పీఎం సూర్యఘర్ యోజనపై ప్రజలకు శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వ రాయితీతో సోలార్ ప్యానల్స్‌ను ప్రభుత్వం లబ్ధిదారులకు అందజేస్తుందని, సోలార్ ప్యానల్స్ ద్వారా విద్యుత్ బిల్లులు కట్టకుండా ఆదా చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉమాదేవి పాల్గొన్నారు.

సోలార్ పవర్ వాడకంపై అవగాహన

మార్కాపురం టౌన్: పీఎం సూర్య ఘర్ సోలార్ పథకాన్ని ఉపయోగించుకోవాలని విద్యుత్ డీఈ సియా నాయక్ కోరారు. మార్కాపురం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో కంభం రోడ్డు, కమలా హ్యాపీ హోమ్స్ ఏరియాల్లో పీఎం సూర్య ఘర్ సోలార్‌పై శుక్రవారం అవగాహన కల్పించారు. పీఎం సూర్య ఘర్ స్కీమ్ కింద సోలార్ సిస్టంను అమర్చుకుంటే సబ్సిడీ ఏ విధంగా వర్తిస్తుందో, విద్యుత్ బిల్లును ఎలా తగ్గించుకోవచ్చో వివరించారు. వలంటరీ అడిషనల్ లోడ్ స్కీమ్ కింద 50 శాతం డిస్కౌంట్ ఉపయోగించుకుని ఇంటికి ఉన్న అడిషనల్ లోడ్ మార్చి నెల 1వ తేదీ నుంచి జూన్ 30వ తేదీ వరకూ అడిషనల్ లోడ్ రెగ్యులర్ చేసుకునే విధంగా అవగాహన కల్పించారు. ఏఏఓ చంద్రశేఖర్, లైన్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీలు

కంభం: పట్టణంలోని వైజంక్షన్, కందులాపురం కూడలిలో శుక్రవారం రాత్రి కంభం సీఐ మల్లికార్జున ముమ్మరంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఇటీవల కాలంలో దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో వాహనాల తనిఖీలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. డ్రంక్ డ్రైవ్ టెస్ట్‌లు నిర్వహించి మద్యం తాగి వాహనాలు నడిపే వారికి జరిమానాలు విధించారు. సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కారు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

తర్లుపాడు: మండలంలోని సీతానాగులవరం సమీపంలో తర్లుపాడు నుంచి మార్కాపురం వెళ్లే ప్రధాన రహదారిపై కారు బోల్తా కొట్టి పొలాల్లోకి దూసుకెళ్లిన సంఘటన శుక్రవారం సాయంత్రం జరిగింది. ఓ వ్యక్తి వేగంగా కారు నడుపుతూ అదుపు చేయలేక ప్రమాదం జరిగినట్లు స్థానికులు పేర్కొన్నారు. సదరు వ్యక్తికి గాయాలు కావడంతో కారును అక్కడే వదిలేసి వెళ్లిపోయాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు.

తాళాలు వేసిన ఇళ్లే టార్గెట్

తాళ్లూరు: మండలంలో దొంగలు హల్‌చల్ చేస్తున్నారని, తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తున్నారని, తస్మాత్ జాగ్రత్తగా ఉండాలని ఎస్సై ఎస్.మల్లికార్జునరావు శుక్రవారం సూచించారు. ఒక జంట ఈ ప్రాంతంలో దొంగతనాలకు పాల్పడుతున్నట్లు ఆయన అనుమానం వ్యక్తం చేశారు. తొలుత మహిళ ప్రతి ఇంటికి వెళ్లి అనాథాశ్రమానికి సాయం చేయమని కోరుతుంది. అలా వెళ్లి తాళం వేసి ఉన్న ఇళ్లను గమనిస్తుంది. ఆ తర్వాత తన పక్కన ఉండే మగ మనిషికి సమాచారం ఇస్తుంది. ఇలా వీళ్లు దొంగతనాలకు పాల్పడుతున్నారని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్సై మల్లికార్జునరావు సూచించారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



ఎస్సీ కాలనీలో ఇంటి పరిసరాలను పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది

కొనకనమిట్ల: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత..అని, ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి జి.కృష్ణయ్య పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని గొట్లగట్టు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని ఎస్సీ కాలనీలో వైద్య సిబ్బందితో ఆయన పర్యటించి ప్రజలకు పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత, దోమల నివారణపై అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నా మురికి నీరు నిల్వ ఉన్నా దోమలు ఎక్కువగా ఉంటాయని, దోమలు కుడితే అనేక వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. దోమల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఇంటి ఆవరణలో పాత టైర్లు, కుండలు, రోళ్లు, వాడి పడేసిన కొబ్బరి బోండాలు ఉన్న వాటిని తీసి పడేయలన్నారు. మలేరియా, డెంగీ జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏవైనా అనారోగ్య సమస్యలు ఉంటే ప్రభుత్వ వైద్యశాలలో సంప్రదించి డాక్టర్ సలహాలు పొందాలన్నారు. ఎంపీహెచ్‌ఈఓ నారాయణరెడ్డి, ఎంపీహెచ్‌ఎస్ వెంకటేశ్వర్లు, ఏఎన్ఎం కెతూర, ఆశా కార్యకర్త స్వాతి పాల్గొన్నారు.

నాణ్యత ప్రమాణాలతో ఉత్తమ బోధన

- జార్జి కళాశాలకు స్వయం ప్రతిపత్తి
- పశ్చిమ ప్రాంతంలో అటానమస్ పొందిన మొదటి కళాశాల
- మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్



నాక్ ఏ గ్రేడ్ సర్టిఫికెట్ చూపుతున్న మాజీ మంత్రి సురేష్

మార్కాపురం: నాణ్యత ప్రమాణాలు ఇంకా మెరుగుపరిచి ఉత్తమ బోధనతో విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించేందుకు ఉత్తమ బోధన అందిస్తామని జార్జి కళాశాల సాంకేతిక సలహాదారులు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. శుక్రవారం జార్జి కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. డాక్టర్ శామ్యూల్ జార్జి ఇంజినీరింగ్ కళాశాలకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) స్వయం ప్రతిపత్తిని కలిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. పశ్చిమ ప్రకాశంలో ఏర్పడిన మొట్టమొదటి ఇంజినీరింగ్ కళాశాలగా జార్జి కళాశాలకు గుర్తింపు ఉండగా ఇప్పుడు అటానమస్ పొందిన మొదటి కళాశాల కూడా జార్జి కళాశాలే కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కేంద్ర విద్యాశాఖ పరిధిలో యూజీసీ జార్జి కళాశాలకు 10 సంవత్సరాల (2025–26 నుంచి 2034–35) వరకూ అటానమస్ స్టేటస్ స్వయం ప్రతిపత్తిని ఇచ్చినట్లు చెప్పారు. ఇప్పటికే కళాశాలకు జేఎన్‌టీయూ కాకినాడ శాశ్వత అనుబంధం, పర్మినెంటు అఫిలియేషన్, ఉన్నత ప్రమాణాలు పర్యవేక్షించే కేంద్ర ప్రభుత్వ సంస్థ నాక్ ఏ (ఎన్ఏఏసీ–ఏ) గ్రేడు ఇచ్చినట్లు తెలిపారు. ఇప్పుడు అటానమస్ కలిపించడం ద్వారా కళాశాల సిలబస్ తయారు చేసుకోవడం, నూతన కోర్సులు ఏర్పాటు చేసుకునేందుకు, విద్య సంవత్సరపు క్యాలెండర్‌ను తయారు చేసుకునేందుకు, ఎగ్జామ్స్ నిర్వహణ, మూల్యాంకనం, రిజల్ట్స్ డిక్లేర్ చేసేందుకు పూర్తి స్వేచ్ఛ ఉంటుందని, తద్వారా విద్యార్థులకు నైపుణ్యత, ఉద్యోగ అవకాశాలు పెంచేందుకు, నూతన ఒరవడికి సహాయపడుతుందన్నారు. కళాశాల 28 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో తమకు తోడుగా అండగా ఉన్న విద్యార్థులకు, వారి కుటుంబ సభ్యులకు, శ్రేయోభిలాషులకు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు మాజీ మంత్రి సురేష్ ప్రకటించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రాజబాబు, అకడమిక్ డీన్ డాక్టర్ మస్తానయ్య, ఐక్యుఏసీ కో ఆర్డినేటర్ డాక్టర్ సయ్యద్ ఖాశీం, వివిధ విభాగాధిపతులు డాక్టర్ సాధూనాయక్, ఆది సత్యనారాయణ, అడ్మిషన్ డైరెక్టర్ కె.డానియేల్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే



బేస్తవారిపేటలో శిలువను మోస్తున్న ఫాదర్ ప్రభాకర్



శిలువ ప్రదర్శన చేస్తున్న క్రైస్తవులు



కొమరోలు: శిలువ మోస్తున్న క్రైస్తవులు



కంభంలోని చర్చిలో ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులు



పాటలు పాడుతున్న చర్చి సభ్యులు

బేస్తవారిపేట: స్థానిక ఆర్‌సీఎం చర్చి ఫాదర్ ప్రభాకర్ ఆధ్వర్యంలో బేస్తవారిపేట బస్టాండ్ నుంచి చర్చి వద్దకు శిలువ మార్గం తెలుపుతూ శుక్రవారం శిలువను మోశారు. అంబేడ్కర్ కాలనీ నుంచి జంక్షన్ వరకు బిలీవర్స్ ఈస్టర్న్ చర్చి ఫాదర్ గుర్రం జాన్ రంగయ్య శిలువ యాత్ర నిర్వహించారు. క్రీస్తు త్యాగానికి ప్రతీకగా నిలిచే గుడ్‌ఫ్రైడే సందర్భంగా చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘపెద్దలు పాల్గొన్నారు.

గుడ్ ఫ్రైడే సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు

గిద్దలూరు రూరల్: గుడ్ ఫ్రైడే సందర్భంగా మండలంలోని క్రైస్తవులు శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్లు శిలువ ధరించి క్రీస్తు అనుసరించిన మార్గాన్ని వివరించారు. పట్టణంలోని ఆర్‌సీఎం చర్చి నిర్వాహకులు కుమ్మరాంకట్ట సెంటర్, గాంధీబొమ్మ సెంటర్‌తో పాటుగా పలు వీధుల్లో ప్రదర్శనలు నిర్వహించారు. మండలంలోని ముండ్లపాడు, కె.ఎస్.పల్లె, అంబవరం, ఉయ్యాలవాడ గ్రామాల్లో చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

కొనకనమిట్ల: ప్రజలు శాంతి మార్గంలో జీవించడమే లోకరక్షకుడైన ఏసుకు ఇష్టమని సువార్తకులు గొంగటి కిషోర్‌కుమార్, జాన్, మారంరెడ్డి కాశిరెడ్డి అన్నారు. గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకుని శుక్రవారం మండలంలోని కొనకనమిట్ల, గొట్లగట్టు, ఎదురాళ్లపాడు, వద్దిమడుగు, పెదారికట్ల చర్చిల్లో ప్రత్యేక కూటాలు నిర్వహించారు. ఆయా చర్చిల్లో మంచి శుక్రవారం సందర్భంగా ఏసుక్రీస్తు అనుకరించిన ఏడు సప్తసూక్తుల గురించి వివరించారు. నియమాలతో నడుస్తున్న వారికి ఏసుక్రీస్తు మంచి చేస్తాడని, ప్రతి ఒక్కరూ దైవ మార్గంలో నడవాలని పాస్టర్ కిషోర్‌కుమార్ కోరారు. దేవుడిని నమ్ముకున్న వారికి చీకటిలో కాంతిలా, ఆపద వేళల్లో మిత్రుడిలా ఏసురక్షణ ఉంటుందన్నారు.

కంభం: గుడ్‌ఫ్రైడేను శుక్రవారం కంభం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని చర్చిలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి క్రీస్తు సందేశాన్ని అందించారు. పాస్టర్లు భక్తులతో కలసి శిలువ మోస్తూ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. మార్గ మధ్యలో ప్రార్థనలు చేశారు.

కొమరోలు: మండలంలో గుడ్‌ఫ్రైడేని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గోపాలునిపల్లె చర్చి నుంచి క్రైస్తవులు శిలువ మోసుకుంటూ మజిలీల వద్ద ఆగి ప్రార్థనలు చేసుకుంటూ కొమరోలులోని సీఎస్ఆర్ చర్చి వరకు ర్యాలీగా వెళ్లారు. చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

పొదిలి: శుభ శుక్రవారం సందర్భంగా స్థానిక సెంటినరీ తెలుగు బాప్టిస్ట్ చర్చిలో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. శిలువను మోస్తున్న ఏసుక్రీస్తు వేషధారి కార్యక్రమం జరిగింది. చర్చి నుంచి ఆర్టీసీ బస్టాండ్, కొత్తూరు సెంటర్, ఆంజనేయస్వామి గుడి, ఎంపీడీఓ కార్యాలయం మీదుగా శిలువ ప్రదర్శన జరిగింది. జగతికి శాంతి సందేశం లాంటి కీర్తనలు ఆలపించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.

గుడ్‌ఫ్రైడే సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు

మార్కాపురం: మానవాళి పాపాల కోసం జీసెస్ శిలువపై ప్రాణాలు అర్పించారని, శిలువపై ఏసు పలికిన 7 వాక్యాలను గుర్తు చేసుకున్నారు, పొరుగువారిని ప్రేమించాలని ఏసుక్రీస్తు తన బోధనల ద్వారా తెలిపారని గుడ్ ఫ్రైడేను పురస్కరించుకుని శుక్రవారం పట్టణంలోని వివిధ చర్చిల్లో గుడ్‌ఫ్రైడే ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తెలుగు బాప్టిస్టు టౌన్ చర్చిలో అధ్యక్షుడు రెవరెండ్ పాస్టర్ అమృత్‌తేజ్ వాక్య సందేశం అందించారు. చర్చి క్వయర్ సభ్యులు ప్రత్యేక గీతాలు పాడారు. ప్రత్యేక కార్యక్రమాలు, ప్రార్థనలు జరిగాయి. ఏసు శిలువపై పలికిన ఏడు మాటలు వివరించారు. సమస్త మానవాళి చేసిన పాపాలను పరిహరించేందుకే ఏసుక్రీస్తు తన ప్రాణాలు అర్పించారన్నారు. కార్యక్రమంలో చర్చి అధ్యక్షుడు దేవరకొండ సామ్యూల్, ఉపాధ్యక్షుడు గుర్రం ఆర్థర్, సెక్రటరీ పులుకూరి జయరావు, కోశాధికారి రామస్వామి, కార్యనిర్వాహకులు పోలయ్య, బాబీ, సతీష్, ప్రదీప్, సుజాత, విజయకుమారి, సండే స్కూల్ సూపరింటెండెంట్ గంగాభవానీ, వీబీఎస్ డైరెక్టర్ సుస్మిత, యూత్ డైరెక్టర్ సౌమ్య, వరప్రసాద్, వి.కిరణ్, జయపాల్, సీహెచ్ నెహన్య, టీఎస్ జైపాల్, శామ్ ప్రకాష్, జాన్ వినయ్‌కుమార్ పాల్గొన్నారు.